# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ బుధవారం 28 జనవరి 2026 www.balagamtv.com పేజీలు 4


## నేటి నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

### ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్..

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. సమావేశాల ఆరంభంలో ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించనున్నారు. గురువారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టనున్నారు. అనంతరం ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్‌ను సభలో ప్రవేశపెట్టనున్నారు. బడ్జెట్ సమావేశాలను పురస్కరించుకొని ప్రభుత్వం మంగళవారం అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశంలో పార్లమెంట్‌లో లేవనెత్తాల్సిన అంశాలపై ప్రభుత్వం, విపక్షాల మధ్య చర్చ జరిగింది.అఖిలపక్ష సమావేశంలో వివిధ విపక్ష పార్టీల నేతలు పలు అంశాలపై చర్చ జరగాలని డిమాండ్ చేశారు. యూపీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాలన్న అంశం, ఓటర్ల జాబితా సవరణకు చేపట్టిన 'సర్' ప్రక్రియ, భారత విదేశాంగ విధానం, వివాదాస్పదమైన యూజీసీ కొత్త మార్గదర్శకాలపై పార్లమెంట్‌లో చర్చ జరపాలని కోరారు.అయితే ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాలన్న డిమాండ్‌ను, అలాగే 'సర్' ప్రక్రియపై విస్తృత చర్చ నిర్వహించాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం తోసిపుచ్చినట్లు సమాచారం



## భారత్-యూరోపియన్ యూనియన్ మధ్య
# చారిత్రక ఎఫ్‌టీఏ

- 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్'గా అభివర్ణించిన ప్రధాని మోదీ

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

భారత్--యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య చారిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంకుదిరింది. ఇండియన్ ఎనర్జీ వీక్ వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ ఈ కీలక విషయాన్ని ప్రకటించారు. ప్రపంచ జీడీపీలో 25 శాతం, ప్రపంచ వాణిజ్యంలో దాదాపు మూడో వంతు వాటా కలిగిన ఈ ఒప్పందాన్ని "మదర్ ఆఫ్ ఆల్ డీల్స్"గా ప్రధాని అభివర్ణించారు. ఈ కీలక ఒప్పందంపై సోమవారం సంతకాలు జరిగాయని వెల్లడించారు.ఈ ఒప్పందం ద్వారా 140 కోట్ల మంది భారతీయులకు, కోట్లాది మంది యూరోపియన్ ప్రజలకు అపారమైన అవకాశాలు లభించనున్నాయని మోదీ తెలిపారు. భారత్--ఈయూ ట్రేడ్ డీల్ ప్రపంచంలోని రెండు ప్రధాన ఆర్థిక వ్యవస్థల మధ్య భాగస్వామ్యానికి అద్భుతమైన ఉదాహరణగా నిలుస్తుందన్నారు.

బ్రిటన్, యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్ (ఇఫ్టా)తో ఇప్పటికే కుదిరిన ఒప్పందాలకు ఈ డీల్ అదనపు బలాన్ని ఇస్తుందని ప్రధాని చెప్పారు. దీని వల్ల ప్రపంచ సప్లై చైన్ మరింత బలోపేతం అవుతుందని, అంతర్జాతీయ వ్యాపారవేత్తలు, పెట్టుబడిదారుల్లో భారత్?పై నమ్మకం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు.

ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం తయారీ రంగంతో పాటు సేవా రంగాన్ని కూడా భారీగా విస్తరించనుందని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. వస్త్రాలు, రత్నాలు, ఆభరణాలు, తోలు, పాదరక్షల రంగాల్లో ఉన్న వారికి ఈ ఒప్పందం విశేషంగా ఉపయోగపడుతుందని పేర్కొంటూ, ఆయా రంగాలకు చెందిన వారిని ప్రధాని అభినందించారు.

ఇండియన్ ఎనర్జీ వీక్ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, భారత్ త్వరలోనే ప్రపంచంలోనే అతిపెద్ద ఆయిల్ రిఫైనింగ్ హబ్?గా అవతరిస్తుందని అన్నారు. ప్రస్తుతం 260 మిలియన్ టన్నులుగా ఉన్న రిఫైనింగ్ సామర్థ్యం 300 మిలియన్ టన్నులకు పెరుగుతుందని తెలిపారు. ఈ దశాబ్దం చివరి నాటికి చమురు, వాయు రంగాల్లో 100 బిలియన్ డాలర్ల పెట్టుబడులను లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు.

ప్రస్తుతం రిఫైనింగ్ సామర్థ్యంలో భారత్ ప్రపంచంలో రెండో స్థానంలో ఉందని, త్వరలోనే మొదటి స్థానానికి చేరుకుంటుందని మోదీ చెప్పారు.

మిగితా 2వ పేజీలో

## మున్సిపల్ పోరుకు
# మోగిన నగారా

- మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదల..
- నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ
- ఫిబ్రవరి 11న పోలింగ్, 13న ఫలితాలు
- 16న మేయర్, డిప్యూటీ మేయర్, ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక
- మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు
- షెడ్యూల్ విడుదల చేసిన ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని




**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా 7 నగరపాలక సంస్థలు, 116 పురపాలక సంఘాల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ఈ నెల 28 నుండి 30 వరకు నామినేషన్ల స్వీకరించనున్నారు. ఈ నెల 31 న స్క్రూటీని ఉంటుంది. షెడ్యూల్ ప్రకారం వచ్చే నెల ఫిబ్రవరి 11న పోలింగ్ జరగనుండగా, ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడించనున్నారు. రేపటి నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుందని ఎన్నికల సంఘం తెలిపింది.

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో షెడ్యూల్ విడుదల చేశారు. అనంతరం ఎన్నికల ప్రక్రియను వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాల్టీల్లోని 2,996 వార్డుల్లో ఒకే విడతలో ఫిబ్రవరి 11న ఎన్నికలు నిర్వహించబోతున్నట్టు చెప్పారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్, 13న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నామని వివరించారు. నేటి నుంచి 30 వరకు నామినేషన్లను స్వీకరిస్తామన్నారు. జనవరి 31న నామినేషన్ల పరిశీలన, ఫిబ్రవరి 3న తుది అభ్యర్థుల జాబితా విడుదల కానుంది. పోలింగ్‌లో ఏవైనా అవాంతరాలు జరిగితే 12న రీ పోలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. ఫిబ్రవరి 14న మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక కోసం సంబంధిత కలెక్టర్ నియమించిన అధికారి ప్రత్యేక సమావేశం కోసం నోటిఫికేషన్ విడుదల చేస్తారని వివరించారు. ఫిబ్రవరి 16న ప్రమాణ స్వీకారం అనంతరం ఎన్నిక నిర్వహిస్తారనీ, ఏదైనా కారణం చేత ఎన్నిక వీలు కాకుంటే మరుసటి రోజు ఫిబ్రవరి 17న నిర్వహిస్తామని చెప్పారు.

### 8,203 పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు

ఎన్నికలు జరుగుతున్న మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాల్టీల్లో 8,203 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్టు ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని తెలిపారు. 52.43 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుంటారని వివరించారు. ఇందులో 25.62 మంది పురుష ఓటర్లు, 26.80 మంది మహిళా ఓటర్లు, 640 మంది ఇతరులు ఉన్నారని తెలిపారు. బ్యాలెట్ పేపర్ విధానంలో జరుగుతున్న ఎన్నికల నిర్వహణకు 16,031 బ్యాలెట్ బాక్స్‌లు, 137 స్ట్రాంగ్ రూంలను ఏర్పాటు చేశామన్నారు. అలాగే 136 లెక్కింపు కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. పోలింగ్ నిర్వహణకు 742 మంది జోనల్ అధికారులు, 279 ఎఫ్ఎస్‌టీ, 381 ఎస్ఎస్‌టీ టీంలను ఏర్పాటు చేశామని తెలిపారు. 1,379 మంది రిటర్నింగ్ అధికారులు, 1,547 మంది అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, 9,560 మంది పోలింగ్ ఆఫీసర్స్, 31,428 మంది అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లు మొత్తం 45,316 మంది ఎన్నికల విధుల్లో పాల్గొంటారని చెప్పారు. ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా ఎన్నికలు నిర్వహిం చేందుకు ఓటర్లు, పోటీచేసే అభ్యర్థులు సహకరిం చాలని విజ్ఞప్తి చేశారు. ఓటర్లందరూ పోలింగ్‌లో స్వచ్ఛందంగా పాల్గొనాలని రాణి కుముదిని పిలుపు నిచ్చారు.

కాల పరిమితి ముగియని మున్సిపల్

మిగితా 2వ పేజీలో

## మంత్రులతో భేటీ
# పాలనాపరమైన సమావేశమే'

- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

**బలగం టీవీ, హైదరాబాద్**



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనలో ఉన్న సమయంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ నిన్న రాత్రి సమావేశం కావడం తెలంగాణ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ భేటీపై వివిధ ఊహాగానాలు వెలువడుతుండగా, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్వయంగా స్పందించారు. మంత్రులు తనతో సమావేశం కావడం సాధారణ విషయమేనని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. "ఉప ముఖ్యమంత్రితో మంత్రులు సమావేశం కాకూడదా?" అని ప్రశ్నిస్తూ, ఇది పూర్తిగా పాలనాపరమైన అంశాలపై జరిగిన చర్చ మాత్రమేనని తెలిపారు. ముఖ్యమంత్రి అందుబాటులో లేని సందర్భంలో, మంత్రులు ఉప ముఖ్యమంత్రిగా తనతో పాలనకు సంబంధించిన విషయాలపై చర్చించారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి విదేశీ పర్యటనలో ఉండగానే ఈ భేటీ జరగడం వెనుక రాజకీయ కారణాలున్నాయనే మీడియా ప్రశ్నకు స్పందించిన భట్టి విక్రమార్క, "కొంతమంది పిచ్చివాళ్లు ఏవేవో మాట్లాడుతుంటారు. వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదు" అంటూ స్పష్టమైన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి, మంత్రులు అందరూ కలిసి ఒకే కుటుంబంలా సమన్వయంతో పనిచేస్తున్నామని ఆయన అన్నారు. ఈ వ్యాఖ్యలతో మంత్రుల భేటీపై నెలకొన్న ఊహాగానాలకు భట్టి విక్రమార్క తెరదించేందుకు ప్రయత్నించారు.

## తెలంగాణలో బీజేపీకి బలం లేదు

- ఎన్ని ప్రయత్నాలు చేసినా అధికారంలోకి రావడం అసాధ్యం
- టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్

**బలగం టీవీ, హైదరాబాద్**



తెలంగాణలో బీజేపీ ఎన్ని ప్రయత్నాలు చేసినా అధికారంలోకి రావడం అసాధ్యమని టీపీసీసీ చీఫ్ మహేశ్?కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ పలు రాజకీయ అంశాలపై స్పందించారు. తెలంగాణలో బీజేపీకి కర్ణాటకలో ఉన్నంత బలం లేదని మహేశ్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని సామాజిక, రాజకీయ పరిస్థితులు బీజేపీ సిద్ధాంతాలకు పూర్తిగా విరుద్ధమని అన్నారు. ప్రజలు ఎన్ని గొడవలు చేసినా, ఎంతగా కొట్లాడినా బీజేపీని ఆదరించే పరిస్థితి తెలంగాణలో లేదని స్పష్టం చేశారు.

తెలంగాణలో బీజేపీ ఎప్పటికీ అధికారానికి ఆమడదూరంలోనే ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజల ఆశయాలకు, అవసరాలకు అనుగుణంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తోందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో నిజామాబాద్ జిల్లాలో బీజేపీతోనే ప్రధాన పోటీ ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో మరో రెండు డీసీసీ అధ్యక్షుల ఎంపికతో పాటు రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలి నియామక ప్రక్రియ ఇంకా పెండింగ్‌లోనే ఉందని వెల్లడించారు.

# నేటి నుంచే మేడారం జాతర

- ఘనంగా ఏర్పాట్లు
- 31 వరకు జాతర..
- నేడు గద్దెలపైకి రానున్న సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్ద రాజు
- 30 లక్షల మందికిపైగా భక్తుల రాక అంచనా



**బలగం టీవీ, వరంగల్**

మేడారం సమ్మక్క--సారలమ్మ జాతరకు జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. జనవరి 28 నుంచి 31 వరకు జరగనున్న ఈ జాతర మేడారం మహాజాతరతో సమాంతరంగా నిర్వహించనున్నారు. ఆదివాసీ దేవత సమ్మక్క జన్మస్థలంగా అగ్రంపహాడ్‌ను భక్తులు విశేషంగా భావిస్తుండటంతో, ఈ నాలుగు రోజుల జాతరకు 30 లక్షల మందికిపైగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.పార్కల్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సమ్మక్క జన్మస్థలంగా విశ్వసించే ఈ గ్రామానికి రాష్ట్రస్థాయి పండుగకు తగ్గ ఏర్పాట్లు అవసరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరుగాంచిన మేడారం సమ్మక్క--సారలమ్మ మహాజాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. నాలుగు రోజుల పాటు మేడారం మహాజాతర అత్యంత వైభవంగా జరగనుంది. ఇప్పటికే లక్షలాది మంది భక్తులు మేడారం చేరుకొని సమ్మక్క--సారలమ్మ గద్దెలను దర్శించుకుంటున్నారు. ముఖ్యమైన నాలుగు రోజుల్లో భారీగా భక్తులు తరలిరానున్న నేపథ్యంలో, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం మేడారం ప్రాంతాన్ని 8 జోన్లు, 42 సెక్టర్లుగా విభజించి విస్తృత ఏర్పాట్లు చేసింది. మొత్తం 21 శాఖలకు చెందిన 42,027 మందికిపైగా అధికారులు, సిబ్బందిని విధుల్లోకి దింపింది.

మహాజాతర ముగిసే వరకు శాంతిభద్రతలకు భంగం కలగకుండా పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టారు. జాతర విధుల్లో 13 వేల మంది పోలీస్ సిబ్బందిని మోహరించారు. భక్తుల రద్దీ దృష్ట్యా టీజీఎస్?ఆర్టీసీ రాష్ట్రంలోని 51 ప్రాంతాల నుంచి మేడారంకు 4 వేల ప్రత్యేక బస్సులను నడపనుంది. మొత్తం 20 లక్షల మంది భక్తులను సురక్షితంగా జాతరకు చేర్చేలా ప్రణాళికలు రూపొందించింది.

### ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర

ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారంలో నిర్వహించే ఈ జాతర కాలక్రమేణా ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా విస్తరించింది. వనదేవతలైన సమ్మక్క--సారలమ్మలు ఇక్కడ భక్తుల పూజలు అందుకుంటారు. ఈ జాతరకు సంబంధించిన అనేక ఇతిహాసాలు, గిరిజన కథలు ప్రాచుర్యంలో ఉన్నాయి.

గిరిజనుల కథనం ప్రకారం, 13వ శతాబ్దంలో కాకతీయుల పాలన కాలంలో

మిగితా 2వ పేజీలో

## సమ్మక్క-సారలమ్మ జాతర ప్రారంభం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు కేసీఆర్ శుభాకాంక్షలు

**బలగం టీవీ, హైదరాబాద్**



మేడారం సమ్మక్క--సారలమ్మ జాతర ప్రారంభం సందర్భంగా బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ త్యాగానికి, పోరాటాలకు ఆదివాసీ దేవతలు సమ్మక్క-సారలమ్మలు ప్రతీకలని ఆయన పేర్కొన్నారు. కొంగు బంగారంలా విలసిల్లే సమ్మక్క--సారలమ్మ దేవతలు కోరిన కోరికలు తీర్చే ఇలవేల్పులని కేసీఆర్ అన్నారు. తమ దేవతలకు మొక్కులు తీర్చుకునేందుకు దేశ నలుమూలల నుంచి కోట్లాది భక్తులు తరలివచ్చే మేడారం జాతర, కుంభమేళాను తలపించే విధంగా ఆధ్యాత్మిక కేంద్రంగా నిలిచిందని వివరించారు. అన్ని రంగాల్లో తెలంగాణ ప్రగతి తిరిగి పుంజుకోవాలని, రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా, సుఖసంతోషాలతో జీవించేలా దీవించాలని సమ్మక్క--సారలమ్మ దేవతలను ప్రార్థించినట్లు కేసీఆర్ తెలిపారు.

# కోల్ మాఫియాకు నాయకుడిగా సీఎం

- ప్రజల దృష్టి మళ్లించేందుకే విచారణల డ్రామా
- మెగావాట్‌కు రూ.7 కోట్ల ఖర్చు ఎందుకు?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- సింగరేణి అవినీతిపై గవర్నర్‌కు బీఆర్ఎస్ వినతి



**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అవినీతి చర్యలపై, ముఖ్యంగా సింగరేణిలో జరుగుతున్న దోపిడీపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలో పార్టీ ప్రతినిధుల బృందం గవర్నర్‌ను కలిసి వివరమైన విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. ఈ బృందంలో శాసనమండలి సభ్యులు, పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడిన కేటీఆర్, సింగరేణిలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై ఆధారాలతో సహా తమ పార్టీ గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. శాసనసభాపక్ష ఉపనాయకులు, మాజీ మంత్రి హరీష్ రావు ఇటీవల నిర్వహించిన పత్రికా సమావేశంలో సింగరేణి కుంభకోణాన్ని ఆధారాలతో బయటపెట్టినప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీలో వణుకు మొదలైందని ఆయన ఆరోపించారు. మీడియా సహకారంతో ఈ కుంభకోణం పూర్తిస్థాయిలో బట్టబయల వడంతో పాలకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజల దృష్టి మళ్లించేందుకు విచారణల పేరిట ఒకరి తర్వాత ఒకరిని పిలుస్తూ డ్రామా చేస్తున్నారని విమర్శించారు. "ఇవాళ సీఎం అంటే చీఫ్ మినిస్టర్ కాదు... కోల్ మాఫియాకు నాయకుడు అనే భావన ప్రజల్లో ఏర్పడింది" అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సింగరేణి నిధుల నుంచి రూ.10 కోట్లను ఫుట్‌బాల్ కార్యక్రమాల పేరిట దుర్వినియోగం చేశారని ఆరోపించిన కేటీఆర్, రాష్ట్ర ప్రజలతోనే కాదు, సింగరేణి సంస్థతో కూడా ముఖ్యమంత్రి ఫుట్?బాల్ ఆడుతున్నారని విమర్శించారు. ఇన్ని ఆధారాలు బయటపెట్టినప్పటికీ ఇప్పటివరకు ప్రభుత్వ వైపు నుంచి ఒక్క సమాధానం కూడా రాలేదన్నారు.

టెండర్లలో గతంలో ఎన్నడూ లేని 'సైట్ విజిట్ సర్టిఫికేషన్' నిబంధనను కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు తీసుకొచ్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలో ఎక్కడా లేని నిబంధనను సింగరేణిలో మాత్రమే ఎందుకు అమలు చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ నిబంధన వల్ల ఎవరికీ లాభం చేకూరిందో స్పష్టత ఇవ్వాలని కోరారు. అలాగే సోలార్ పవర్ ప్రాజెక్టులలోనూ భారీ కుంభకోణం జరిగిందని కేటీఆర్ ఆరోపించారు. దేశవ్యాప్తంగా మెగావాట్‌కు రూ.2.5 నుంచి 3 కోట్ల ఖర్చుతో సోలార్ ప్రాజెక్టులు నిర్మిస్తుంటే, సింగరేణిలో మాత్రం రూ.7 కోట్లకు టెండర్లు ఎందుకు పిలిచారని ప్రశ్నించారు. ఇది స్పష్టమైన స్కామ్ కాదా అని నిలదీశారు.

ఎక్స్‌ప్లోజివ్స్, జిలెటిన్ స్టిక్స్ ధరలను 30 శాతం పెంచడం ద్వారా కాంట్రాక్టర్లకు లాభం చేకూర్చారని, దీనిని ప్రశ్నించిన డైరెక్టర్లపై చర్యలు తీసుకున్నారని విమర్శించారు. ఈ అన్ని అంశాలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ వ్యవహారంపై సీబీఐ విచారణకు గానీ, సిట్టింగ్ జడ్జితో విచారణకు గానీ ఆదేశాలు ఇవ్వాలని గవర్నర్‌ను

మిగితా 2వ పేజీలో

## నేను విద్యాశాఖ మంత్రి అయితే..
# ఆ స్కూళ్లను మూసేస్తా

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.8 కోట్లతో నిర్మించిన పాఠశాల భవనం ప్రారంభం



**బలగం టీవీ, హైదరాబాద్**

కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యా అర్హత లేని సిబ్బందితో బట్టీ చదువులు చెబుతూ.. పేదలను దోచుకుంటున్నాయని, తాను విద్యాశాఖ మంత్రి అయితే రాష్ట్రంలో అలాంటి స్కూళ్లను మూసేస్తానని రోడ్లు, భవనాల శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని అర్హతలు కలిగిన ఉపాధ్యా యలచే నాణ్యమైన బోధన సాగుతోందని చెప్పారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.8 కోట్లతో నిర్మించిన బొట్టుగూడ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల భవనాలను మంగళవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బొట్టుగూడ పాఠశాల భవన నిర్మాణం తన చిరకాల కోరిక అని, పేదవాడు చదువుకోవాలి, చదువుతోనే అభివృద్ధి సాధ్యమని చెప్పారు. 2500 గజాల స్థలంలో అత్యాధునిక వసతులతో భవనాలు నిర్మించామని చెప్పారు. సంప్రదాయ విద్య కాకుండా అన్ని రకాల నైపుణ్యాలను అభివృద్ధి చేసే విధంగా కృషి చేస్తామన్నారు. పాత సిలబస్‌తో పాటు, సీబీఎస్‌ఈ అమలు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో కార్పొరేట్ స్కూల్స్ పేదలను దోచుకుంటున్నాయని, తాను విద్యాశాఖ మంత్రిని అయితే అలాంటి స్కూల్స్ అన్నింటినీ మూసే స్తానని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉపాధ్యాయులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. సరైన విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని చెప్పారు. కుల మతాలకు అతీతంగా విద్యార్థులు చదువుకోవాలన్నది తమ ప్రభుత్వ ఆశయమన్నారు. వచ్చే ఎన్నికల్లో ఉత్సాహం ఉంటేనే పోటీ చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్, ఆర్‌డిఓ వై.అశోక్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు హఫీజ్ ఖాన్, ప్రతీక ఫౌండేషన్ సీఈఓ గోనారెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి పాల్గొన్నారు.

## సంతోశ్‌రావును ఏడు గంటలు విచారించిన సిట్

**బలగం టీవీ, హైదరాబాద్**




ఫోన్‌ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ మాజీ ఎంపీ సంతోశ్‌రావును సిట్ అధికారులు మంగళవారం ఏడున్నర గంటలు సుదీర్ఘంగా విచారించారు. సిట్ అధికారులు ఇచ్చిన నోటీసుల మేరకు సంతోశ్‌రావు మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో జూబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయానికి చేరుకున్నారు. విచారణ జరుగుతుండగా వెలుపల సాయంత్రం ఆరుగంటల ప్రాంతంలో కొందరు బీఆర్ఎస్ నాయకులు చేరుకుని ఆయనను ఎంతసేపు విచారిస్తారంటూ అక్కడ విధుల్లో ఉన్న పోలీసులతో వాగ్వాదానికి దిగారు. వారిని పోలీసులు తోసివేయగా, వికలాంగుడైన ఒక నాయకుడు కిందపడిపోవడంతో కొద్ది సేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాగా, విచారణ పూర్తయ్యాక రాత్రి 10 :30 గంటల ప్రాంతంలో సంతోశ్‌రావు సిట్ కార్యాలయం నుంచి వెళ్లిపోయారు. అవసరమైతే మరో సారి పిలుస్తామని ఆయనకు సిట్ అధికారులు తెలిపారు.



వివరాలు 2వ పేజీలో

# జిల్లాలు తొలగించం

- మంత్రి పొన్నం ప్రభాకర్
- వేములవాడలోని భీమేశ్వర స్వామిని దర్శించుకున్న మంత్రి

# మేడారంలో స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్య సేవలు

- జాతరలో 30, ప్రధాన రహదారుల్లో 42 మెడికల్ క్యాంపుల ఏర్పాటు
- 35 అంబులెన్సులు.. 3,199 మంది సిబ్బందితో వైద్య సేవలు
- పేషెంట్లను తరలించేందుకు మరో 40 బైక్ అంబులెన్స్
- మంత్రి దామోదర్ రాజనర్సింహ

**బలగం టీవీ, హైదరాబాద్**

ఈ నెల 28 నుంచి 31 వరకూ మేడారంలో జరగనున్న సమ్మక్క---సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు వైద్యపరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. చిన్నపాటి అనారోగ్య సమస్య వచ్చినా తక్షణం స్పందించి వైద్యం అందించేలా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. జాతర గద్దెల వద్ద ఏర్పాటు చేసిన 50 పడకల హాస్పిటల్, మినీ హాస్పిటల్స్, ప్రధాన మెడికల్ క్యాంపుల్లో స్పెషలిస్ట్ వైద్యులను డిప్యూట్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవిందర్ నాయక్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరేంద్ర కుమార్, వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్? కుమార్, తదితరులు పాల్గొన్నారు. జాతరలో ఏర్పాటు చేసిన 3 హాస్పిటళ్లు, 30 మెడికల్ క్యాంపులు, జాతరకు వెళ్లే ప్రధాన రహదారుల్లో ఏర్పాటు చేసిన మరో 42 మెడికల్ క్యాంపుల్లో అందిస్తున్న వైద్య



సేవలపై మంత్రి ఆరా తీశారు. 3 హాస్పిటళ్లు, 72 మెడికల్ క్యాంపుల్లో కలిపి 544 మంది డాక్టర్లు సహా మొత్తం 3199 మంది సిబ్బందిని డిప్యూట్ చేశామని అధికారులు మంత్రికి వివరించారు. అవసరమైన అన్ని రకాల మెడిసిన్స్?, కన్జుమబుల్స్?, ఎక్విప్?మెంట్ అందుబాటులో ఉంచుకున్నామని తెలిపారు. మేడారంలో గద్దెల వద్ద 50 పడకల హాస్పిటల్, జంపన్న వాగు వద్ద 6 బెడ్ల హాస్పిటల్, ఇంగ్లీష్ మీడియం స్కూల్?లో మరో మినీ హాస్పిటల్ ఏర్పాటు చేసి, స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకూ 11,625 మందికి వైద్య సేవలు అందించామని వెల్లడించారు. పేషెంట్లను తరలించడానికి (108) అంబులెన్స్?లు 38, బైక్? అంబులెన్స్? 40 సిద్ధంగా ఉంచుకున్నామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జాతరలో ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాల్స్?పై నిఘా పెట్టాలని, నాసిరకం ఆహార పదార్థాలను విక్రయించే షాపులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. జాతరలో ఏర్పాటు చేసిన హాస్పిటల్స్, మెడికల్ క్యాంపుల లొకేషన్లు, ఇతర వివరాలు భక్తులకు తెలిసేలా, తక్షణమే అన్ని చోట్ల బోర్డులు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. జాతరలో ఏర్పాటు చేసిన 3 హాస్పిటల్స్?, ముఖ్యమైన లొకేషన్లలో ఉన్న మెడికల్ క్యాంపుల్లో స్పెషలిస్ట్ డాక్టర్లను డిప్యూట్ చేయాలన్నారు. తక్షణమే మేడారం వెళ్లి, జాతర అయిపోయే వరకూ అక్కడే ఉండి పర్యవేక్షించాలని పబ్లిక్ హెల్త్ డైరెక్టర్, డాక్టర్ రవిందర్ నాయక్?ను మంత్రి ఆదేశించారు.

జాతర ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపులతో పాటు, వివిధ జిల్లాల నుంచి మేడారం చేరుకునే 8 ప్రధాన రూట్లలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపుల్లోనూ డాక్టర్లు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. ముఖ్యంగా 4 వీలర్, 2 వీలర్ అంబులెన్స్?లు 24 గంటలు సిద్ధంగా ఉండాలన్నారు. ఆపద సమయంలో నిమిషాల వ్యవధిలోనే పేషెంట్లను షిఫ్ట్? చేసి, వారికి వైద్యం అందించాలన్నారు. ఒకవేళ పేషెంట్?కు హాస్పిటల్ కేర్ అవసరం పడితే, ములుగు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్?కు, వరంగల్ ఎంజీఎంలకు తరలించాలని మంత్రి సూచించారు. ఈ రెండు హాస్పిటళ్లలో డాక్టర్లు, సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు.

ప్రజలకు మంత్రి శుభాకాంక్షలు.. సూచన

బుధవారం నుంచి జాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో సమ్మక్క, సారలమ్మ భక్తులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. సీఎం రేవంత్?రెడ్డి గారితో కలిసి ఇటీవల మేడారం వెళ్లి తల్లులను దర్శించుకున్న విషయాన్ని మంత్రి గుర్తు చేసుకున్నారు. జాతరకు వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని మంత్రి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వీలైనంత వరకూ సొంతగానే ఫుడ్ ప్రిపేర్ చేసుకోవాలన్నారు. జాతరలో నాణ్యతలేని ఆహార పదార్థాలను కొనుగోలు చేయొద్దన్నారు. అనారోగ్య సమస్య వస్తే వెంటనే సమీపంలోని హెల్త్ క్యాంపునకు వెళ్లి, వైద్య సేవలు పొందాలని మంత్రి సూచించారు. అవసరమైతే 108 నంబర్??కు కాల్ చేయాలని సూచించారు.

# మున్సిపల్ పోరుకు మోగిన నగరా

(మొదటి పేజీ తరువాయి)

కార్పొరేషన్లు, మున్సిపా ల్టీలకు ఎన్నికలు నిర్వహించడం లేదని పురపాలక శాఖ శాఖ డైరెక్టర్ టీకే. శ్రీదేవి తెలిపారు. జీహెచ్ఎంసీ, వరంగల్, ఖమ్మం కార్పొరే షన్లతో పాటు కొత్తూరు, జడ్చర్ల, అచ్చంపేట, సిద్దిపేట, నకిరేకల్ మున్సిపాల్టీలకు ఎన్నికలు జరగడం లేదన్నారు. ఆయా మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాల్టీల్లో ఎన్నికలు జరుగుతున్నవాటితో పాటు రిజర్వేషన్లు ఖరారు చేసినట్టు తెలిపారు. అయితే వాటిలో వార్డులు, డివిజన్ల రిజర్వేషన్లను ఖరారు చేయలేదని తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 50 శాతానికి మించకుండా నిబంధనల ప్రకారం రిజర్వేషన్లను ఖరారు చేసినట్టు శ్రీదేవి తెలిపారు.

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున రూ.50 వేల వరకు మాత్రమే నగదు అనుమతి ఉందని లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీ మహేశ్ భగవత్ తెలిపారు. అంతకంటే ఎక్కువ ఉంటే అందుకు సంబంధించిన పూర్తి వివరాలు తమ వద్ద ఉంచుకోవాలని కోరారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు 25 వేల మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. అన్ని పోలింగ్ స్టేషన్లో వెబ్ కాస్టింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు వివరించారు. సెన్సిటివ్, క్రిటికల్, కమ్యూనల్ సెన్సిటీవ్, సాధారణ పోలింగ్ స్టేషన్లును గుర్తించి నాలుగు విభాగాలుగా విభజించామన్నారు. కమ్యూనల్ సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలైన నిర్మల్, బైంసా, బోధన్, నిజామాబాద్ తదితర ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడంతో పాటు ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గ్రామపం చాయతీ ఎన్నికల సందర్భంగా 1,800 లైసెన్స్ ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామనీ, అర్బన్ ప్రాంతాల్లో ఉన్న వాటిని సైతం స్వాధీనం చేసుకుం టామని చెప్పారు. రౌడిషీటర్లు, ఎన్నికల నేరస్తులను బైండోవర్ చేస్తామన్నారు. మున్సిపల్ ఎన్నికల నిర్వ హణకు సంబంధించి నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# జిల్లాలు తొలగించం

- మంత్రి పొన్నం ప్రభాకర్

**బలగం టీవీ, వేములవాడ**

జిల్లాలను తొలగిస్తారని వస్తున్న సమాచారం అసత్యమని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. మంగళవారం వేములవాడ పట్టణంలోని భీమేశ్వర స్వామిని దర్శించుకున్న అనంతరం, ఆయన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్తో కలిసి మీడియాతో మాట్లాడుతూ, అశాస్త్రీయంగా చేసిన సాంకేతిక మార్పులే ఉంటాయని, రిటైర్డ్ జడ్జితో ఏర్పాటుచేసిన కమిటీ నియోజకవర్గాల పునర్విభజన తర్వాత మాత్రమే పని చేస్తుందని తెలిపారు. మంత్రికి సమాచారం ఇచ్చిన సందర్భంలో వేములవాడ అభివృద్ధి అంశాన్ని ఆయన ప్రత్యేకంగా గమనించారు. వేములవాడకు అమృత్ పథకం ఇవ్వడం ఉంటే స్వాగతిస్తామని పేర్కొన్నారు. గత 12 ఏళ్లలో ఎందుకు వేములవాడకు అమృత్ పథకం ఇవ్వలేదని, ఎన్నికల సమయంలో మాత్రమే హామీలు ఇస్తే అది పొరపాటే అవుతుందని ఆయన విమర్శించారు.అయితే, ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ వేములవాడ అభివృద్ధిని కోరినామని, ప్రభుత్వంలోకి రాగానే మొత్తం క్యాబినెట్? మంత్రులు వేములవాడ అభివృద్ధికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు.

# కోల్ మాఫియాకు నాయకుడిగా సీఎం

(మొదటి పేజీ తరువాయి)

ఎక్స్‌ప్లోజివ్స్, జిలెటిన్ స్టిక్స్ ధరలను 30 శాతం పెంచడం ద్వారా కాంట్రాక్టర్లకు లాభం చేకూర్చారని, దీనిని ప్రశ్నించిన డైరెక్టర్లపై చర్యలు తీసుకున్నారని విమర్శించారు. ఈ అన్ని అంశాలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ వ్యవహారంపై సీబీఐ విచారణకు గానీ, సిట్టింగ్ జడ్జితో విచారణకు గానీ ఆదేశాలు ఇవ్వాలని గవర్నర్‌ను

కోరినట్లు కేటీఆర్ తెలిపారు. సింగరేణి ఓబీ గనులు, సోలార్ పవర్ రంగాల్లో జరుగుతున్న కుంభకోణాలను అడ్డుకుని ప్రజాధనాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశామని చెప్పారు.



# వీధి కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు

**బలగం టీవీ, హైదరాబాద్**



వీధి కుక్కల దాడిలో ఓ చిన్నారి గాయాలపాలైన ఘటన హైదరాబాద్ ఖైరతాబాద్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లికార్జున్ రవళి దంపతుల తమ 6 ఏండ్ల కుమార్తె శార్వితో కలిసి ఖైరతాబాద్ బడా గణేష్ వెనుక ఉన్న శ్రీనివాస్ నగర్‌లో నివాసముంటున్నారు. మంగళవారం బాలిక ఆలస్యంగా నిద్ర నుంచి లేవడంతో స్కూలుకు పంపించలేదు. దాంతో ఆమె ఇంటి ముందు ఆడుకుంటుండగా ఒక్కసారిగా వచ్చిన ఓ వీధి కుక్క దాడి చేసింది. అదే సమయంలో అటుగా వెళ్తున్న ఓ వాహనదారుడు సకాలంలో స్పందించి కుక్కను వెళ్లగొట్టడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అనంతరం ఆ వ్యక్తి బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. వెంటనే చిన్నారిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం బంజారాహిల్స్‌లోని రేయిన్‌బో ఆస్పత్రికి తరలించారు. ఈ దాడిలో చిన్నారి దవడ భాగం దెబ్బతిన్నది. వీధి కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడాలని చిన్నారి నాయనమ్మ తారాబాయి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

# నేటి నుంచే మేడారం జాతర

(మొదటి పేజీ తరువాయి)

పొలవాస ప్రాంతాన్ని పాలించిన మేడరాజు కాలంలో సమ్మక్క దేవత వెలుగులోకి వచ్చారు. చిన్నారి రూపంలో అడవిలో లభించిన సమ్మక్కను మేడరాజు దత్తత తీసుకుని పెంచగా, ఆమె గిరిజనులకు రక్షకురాలిగా మారారు. తర్వాత మేడారం పాలకుడైన పగిడిద్ద రాజును వివాహం చేసుకున్నారు. వారికి సారలమ్మ, నాగులమ్మ, జంపన్న సంతానం.

కాకతీయ రాజు ప్రతాపరుద్రుడి దండయాత్ర సమయంలో జరిగిన యుద్ధంలో సమ్మక్క--సారలమ్మ కుటుంబ సభ్యులు వీరమరణం పొందగా, సమ్మక్క చివరకు చిలకలగుట్ట వైపు వెళ్లి అదృశ్యమయ్యారని గిరిజనుల నమ్మకం. ఆమెకు గుర్తుగా లభించిన కుంకుమ భరణినే సమ్మక్కగా భావించి, విగ్రహం లేకుండానే జాతర నిర్వహిస్తున్నారు.

**జాతర కార్యక్రమాల వివరాలు**

జనవరి 28 (బుధవారం): సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్ద రాజుల గద్దెలపైకి రాకతో జాతర ప్రారంభం

జనవరి 29 (గురువారం): సమ్మక్క అమ్మవారు గద్దెలపైకి రాక

జనవరి 30 (శుక్రవారం): సమ్మక్క--సారలమ్మ గద్దెలపై దర్శనం, భక్తుల మొక్కుల సమర్పణ

జనవరి 31 (శనివారం): సాయంత్రం 6 గంటలకు దేవతల వనప్రవేశంతో జాతర ముగింపు

ప్రస్తుతం మేడారం పరిసర ప్రాంతాలు భక్తుల నినాదాలు, డోలు--తప్పెట్ల మోతతో మారుమోగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఏర్పాట్లతో భక్తులు సురక్షితంగా, సౌకర్యవంతంగా జాతరలో పాల్గొనేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధమయ్యాయి.

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పోలీస్ శాఖ 600 మంది సిబ్బందిని మోహరించింది. 150 సీసీ కెమెరాలతో పాటు ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పోలీస్ కమిషనర్ సున్?ప్రీత్ సింగ్ మార్గదర్శకత్వంలో ఏర్పాటు చేశారు. వాహనాల పార్కింగ్ కోసం ఆరు ప్రాంతాలను గుర్తించగా, తాత్కాలికంగా రైతుల భూములను వినియోగించుకునేందుకు వారికి పరిహారం చెల్లించనున్నట్లు అధికారులు తెలిపారు. హనుమకొండ నుంచి అగ్రంపహాడ్?కు టీజీఎస్?ఆర్టీసీ ప్రతి 15 నిమిషాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనుంది.

పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహక అధికారి ఏ. నాగేశ్వరరావు తెలిపారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్?తో పాటు సమీప గ్రామపంచాయతీలకు చెందిన 200 మంది కార్మికులు 24 గంటల పాటు విధులు నిర్వహించనున్నారు. మహిళల సౌకర్యార్థం ప్రత్యేక డ్రెస్సింగ్ రూమ్?లు, 100 తాత్కాలిక మరియు మొబైల్ మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తున్నారు. తాగునీటి కోసం గ్రామీణ నీటి సరఫరా శాఖ 17 శాశ్వత ట్యాప్ కనెక్షన్లు ఏర్పాటు చేసి, పలు ప్రాంతాల్లో వాటర్ ట్యాంకర్లను అందుబాటులో ఉంచింది.

వైద్య సౌకర్యాల పరంగా ఐదు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయగా, అత్యవసర చికిత్స కోసం ఆత్మకూరులో 10 పడకల ప్రత్యేక ఆసుపత్రిని సిద్ధం చేశారు. నిరంతర విద్యుత్ సరఫరా కోసం విద్యుత్ శాఖ నాలుగు 160 కిలోవాట్ల ట్రాన్స్?ఫార్మర్లు ఏర్పాటు చేసింది. అలాగే, సాగునీటి శాఖ ఎస్సారెస్పీ కాలువ వెంట మరియు స్థానిక చెరువు వద్ద 15 స్నాన ఘాట్లను ఏర్పాటు చేసి, పవిత్ర స్నానానికి తగిన నీటి మట్టం ఉండేలా చర్యలు చేపట్టింది. అగ్రంపహాడ్ మెదారం వెళ్లే భక్తులకు ప్రధాన ద్వారంగా మారిందని కలెక్టర్ స్నేహ శబరీష్ తెలిపారు. భక్తుల సౌకర్యార్థం క్యూలైన్లు, లైటింగ్ వ్యవస్థ, వీఐపీ నిర్వహణ ఏర్పాట్లు పూర్తిగా సిద్ధంగా ఉన్నాయని, బుధవారం నుంచి ఇవన్నీ పూర్తిస్థాయిలో అమల్లోకి వస్తాయని ఆమె వెల్లడించారు.

# భారత్-యూరోపియన్ యూనియన్ మధ్య చారిత్రక ఎఫ్‌టీఏ

(మొదటి పేజీ తరువాయి)

ఇండియన్ ఎనర్జీ వీక్?లో భాగంగా ప్రపంచవ్యాప్తంగా దాదాపు 150 దేశాలకు చెందిన ప్రతినిధులు గోవాకు వచ్చినట్లు తెలిపారు.

**'ఐరోపా-భారత్ చరిత్ర సృష్టించాయి'- ఉర్సులా వాన్‌డెర్ లెయన్**

భారత్--ఈయూ ఒప్పందంపై యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్?డెర్ లెయన్ స్పందించారు. "ఐరోపా--భారత్ ఈ రోజు చరిత్ర సృష్టించాయి. మదర్ ఆఫ్ ఆల్ డీల్స్?ను పూర్తి చేశాం. దాదాపు రెండు బిలియన్ల ప్రజల మధ్య స్వేచ్ఛా వాణిజ్యానికి బాటలు వేసాం. ఇది కేవలం ప్రారంభం మాత్రమే. భవిష్యత్తులో మా వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తాం" అని ఆమె ట్వీట్ చేశారు.

**ఈయూ నేతలతో ప్రధాని మోదీ భేటీ**

ఒప్పంద ప్రకటన అనంతరం ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్?లో ప్రధాని మోదీ, యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్?డెర్ లెయన్?తో సమావేశమయ్యారు. అనంతరం ఇండియా--ఈయూ శిఖరాగ్ర సదస్సులో పాల్గొన్నారు. దీనికి ముందు రాజ్?ఘాట్?లో మహాత్మా గాంధీ స్మారకాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అక్కడి విజిటర్స్ బుక్?లో ఈయూ నేతలు సంతకాలు చేశారు.

# అఖిల భారత బ్యాంకు సమ్మె

## వారానికి 5 రోజుల పని విధానాన్ని వెంటనే అమలు చేయాలి : బ్యాంకు ఉద్యోగులు







**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ పిలుపు మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లాలో బ్యాంక్ ఉద్యోగులు నేడు సమ్మె బాట పట్టారు. వారానికి ఐదు రోజుల పని విధానాన్ని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ రంగ బ్యాంకులైన ఎస్?బిఐ, యుబిఐ, బిఓబి తో పాటు ఇతర బ్యాంకుల అధికారులు, సిబ్బంది పెద్ద ఎత్తున నిరసనలో పాల్గొన్నారు.

సిరిసిల్ల పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద ఉద్యోగులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు మనోహర్, శ్రీధర్, బాబురాజ్, పవన్?కల్యాణ్ మరియు శ్రీనివాస్ మాట్లాడుతూ.. బ్యాంకు ఉద్యోగులకు ఐదు రోజుల పని విధానం కల్పించడం తమ న్యాయమైన హక్కని స్పష్టం చేశారు.

2024 మార్చి 8న కుదిరిన 12వ ద్వైపాక్షిక ఒప్పందంలో భాగంగా ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (క్రిమ్‌దీూ) ఐదు రోజుల పని విధానాన్ని ఇప్పటికే సిఫార్సు చేసిందని, కానీ అది కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్?లో ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని శనివారాలను సెలవులుగా ప్రకటిస్తే, దానికి బదులుగా రోజువారీ పని సమయాన్ని మరో 40 నిమిషాలు పెంచేందుకు తాము సిద్ధంగా ఉన్నామని వారు గుర్తు చేశారు. ఆర్?బిఐ, ఎల్?ఐసి, సెబీ వంటి కీలక ఆర్థిక సంస్థలు ఇప్పటికే ఐదు రోజుల పని విధానాన్ని పాటిస్తున్నాయని, బ్యాంకుల విషయంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. ఆరు రోజుల పని వల్ల ఉద్యోగులపై శారీరక, మానసిక ఒత్తిడి పెరిగి వ్యక్తిగత జీవితం దెబ్బతింటోందని, ఐదు రోజుల పని విధానంతో ఉద్యోగుల పనితీరు మెరుగుపడి ఖాతాదారులకు మరింత నాణ్యమైన సేవలు అందుతాయని పేర్కొన్నారు.

తమ డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం తక్షణమే గుర్తించి, 12వ ద్వైపాక్షిక ఒప్పందానికి ఆమోద ముద్ర వేయాలని, లేనిపక్షంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ఉద్యోగ సంఘాల నేతలు హెచ్చరించారు.






## నామినేషన్ల స్వీకరణ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి..

- సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించిన ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్.

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
మున్సిపల్ కార్యాలయాల్లో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని మున్సిపల్ కార్యాలయాన్ని ఇంచార్జి కలెక్టర్ క్షేత్రస్థాయిలో సందర్శించి, మున్సిపల్ ఎన్నికల సందర్భంగా నామినేషన్ల స్వీకరణకు చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. నామినేషన్ల స్వీకరణకు ఎన్ని కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారని, వాటిలో ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారని మున్సిపల్ కమిషనర్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. నామినేషన్ల దాఖలు సమయంలో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా స్పష్టమైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, సహాయార్థం ప్రత్యేక హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే ఎన్‌ఓసీ కౌంటర్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్శనలో మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# రెడ్డి ఐక్యతతోనే సామాజికాభివృద్ధి సాధ్యం..



- రాజన్న సిరిసిల్ల జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి
- ఇల్లంతకుంటలో నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు ఆత్మీయ సన్మానం

**బలగం టీవీ, ఇల్లంతకుంట**
రాజకీయాలకు అతీతంగా రెడ్డి సంక్షేమ సంఘాలను గ్రామ స్థాయిలో బలోపేతం చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఇల్లంతకుంట మండల కేంద్రంలో రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు మరియు వార్డు సభ్యులకు నిర్వహించిన ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రెడ్డి ఐక్యత కోసం చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు. మండల కేంద్రంలో రెడ్డి సంఘ భవన నిర్మాణానికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. రాజకీయాలు ఏవైనా, సంఘం విషయంలో అందరూ ఒక్కతాటిపైకి వచ్చి సామాజికాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు.

ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన రెడ్డి సామాజిక వర్గానికి చెందిన సర్పంచులను, ఉప సర్పంచులను మరియు వార్డు సభ్యులను సంఘం తరపున శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల రెడ్డి సంఘం అధ్యక్షులు బొంపల్లి రాఘవరెడ్డి, సెస్ డైరెక్టర్ మల్ గారి రవీందర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ చైతన్య మహేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ ఉత్కూరి వెంకట రమణారెడ్డి, జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం ఈసీ మెంబర్ కంకణాల శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, మాజీ ప్యాక్ చైర్మెన్ రోండ్ల తిరుపతిరెడ్డి, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు తూముకుంట శ్రీనివాస్ రెడ్డి, ఇల్లంతకుంట రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు రవీందర్ రెడ్డి, వివిధ గ్రామాల గ్రామ శాఖ అధ్యక్షులు, రెడ్డి సర్పంచులు, రెడ్డి ఉప సర్పంచ్లు, రెడ్డి వార్డు మెంబర్లు మరియు రెడ్డి నాయకులు పాల్గొన్నారు.




## విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీ చేసిన రేపాక సర్పంచ్ కాత..

**బలగం టీవీ, ఇల్లంతకుంట:**
ఇల్లంతకుంట మండలం రేపాక గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం-3 విద్యార్థులకు రేపాక గ్రామ సర్పంచ్ కాత మల్లేశం యూనిఫార్మ్ పంపిణీ చేశారు. మంగళవారం రేపాక గ్రామంలోని స్థానిక అంగన్వాడీ కేంద్రం -3లో విద్యార్థులకు సర్పంచ్ యూనిఫామ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రేపాక గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రం పిల్లలకు కూడా ప్రభుత్వం యూనిఫార్మ్ అందజేయడం హర్శించ దగ్గ విషయమని, యూనిఫామ్ అనేది గుర్తింపుతో పాటు గౌరవాన్ని కల్గిస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కోదాని మహేష్, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు అమరేందర్, స్రవంతి, అంగన్వాడి టీచర్ మీసాల హంస లీల, ఆయా జోగు అంజలి, గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# అక్రిడిటేషన్ల సవరణ జీవో పై టీయూడబ్ల్యూజే హర్షం.

- నియోజకవర్గ స్థాయి, కేబుల్ ఛానల్ రిపోర్టర్స్ సైతం న్యాయం చేయాలి..
- రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా

**బలగం టీవీ, ఇల్లంతకుంట:**
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా డెస్క్ జర్నలిస్టులకు సైతం అక్రిడిటేషన్ కార్డులే జారీ చేస్తామని తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చిన సవరణ జీవో నెంబర్ 103 పై తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం హర్షం వ్యక్తం చేసింది.



యూనియన్ జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా లు మాట్లాడుతూ.. గతంలో తీసుకువచ్చిన 252 జీవో పై టి యు డబ్ల్యూ జే చేసిన పోరాట ఫలితంగా జర్నలిస్టు సంఘాలతో సమావేశాన్ని ఏర్పాటు చేసిన సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సవరణ జీవో తేవడం, అందులో ప్రధానంగా అందరి జర్నలిస్టుల మాదిరిగానే డెస్క్ జర్నలిస్ట్ సైతం అక్రిడిటేషన్ కార్డులే జారీచేస్తామని చేస్తున్నారని స్పష్టం చేయడం అభినందనీయం అన్నారు. మండల స్థాయి లో లక్షన్నరకు పైగా జనాభా ఉన్నచోట అదనపు కార్డులు ఇస్తామని పేర్కొనడంతోపాటు కల్చరల్, స్పోర్ట్స్, సినిమా జర్నలిస్టులకు సైతం ప్రత్యేకంగా కార్డులు జారీ చేస్తానని ప్రకటించడం పట్ల ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జీవో మారడం టియుడబ్ల్యూజే సాధించిన విజయంగా వారు పేర్కొన్నారు. అయితే గత ప్రభుత్వ హయాంలో వచ్చిన 239 జీవో ప్రకారం వచ్చినన్ని అక్రిడేషన్ కార్డులు ఈ సవరణ జీవో అనంతరం కూడా ఆ స్థాయిలో రావడంలేదని విషయం తేటతెల్లమైందన్నారు. కార్డుల సంఖ్య భారీగా తగ్గనున్న నేపథ్యంలో ప్రభుత్వం మరోసారి పునరాలోచన చేసి 239 జీవో ప్రకారం జారీ అయిన కార్డుల సంఖ్యనే వర్తింపచేయాలని కోరారు.

**కేబుల్ చానల్స్, నియోజకవర్గ స్థాయి రిపోర్టర్లకు మరోసారి మొండిచెయ్యి**

గతంలో రాష్ట్రస్థాయిలో కేబుల్ ఛానల్ లకు 12 కార్డులు చొప్పున ఐ అండ్ పి ఆర్ ద్వారా జారీ చేశారని, ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఈ సవరణ జీవోలో కేబుల్ చానల్స్ అంశమే లేకపోవడం ఆందోళన కలిగిస్తుంది అన్నారు. యూనియన్ గా మా అభిప్రాయాన్ని చెప్పినప్పటికీ కేబుల్ చానల్స్ విషయంలో, నియోజకవర్గ స్థాయిలో రిపోర్టర్లకు ఇచ్చే కార్డుల విషయంలో ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమన్నారు. ఈ విషయమై సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ ను వెంటనే కలిసి మరోమారు చర్చిస్తామని, అప్పటికీ స్పందించకపోతే ఈ రెండు అంశాలపై భవిష్యత్ కార్యాచరణ త్వరలో వెల్లడిస్తామన్నారు. లేనియెడల మరోసారి ఆందోళన బాటతప్పదని హెచ్చరించారు

# సేవే లక్ష్యం.. అభివృద్ధే ధ్యేయం..

- కాంగ్రెస్ పార్టీ నేత నల్ల శ్రావణ్

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల**
కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలుస్తున్న 20వ వార్డు అభ్యర్థి, తనదైన శైలిలో ప్రచారాన్ని ముమ్మరం చేస్తూ ప్రజల ఆశీర్వాదాలను కోరుతున్నారు. ఈ సందర్భంగా నల్ల శ్రావణ్ మాట్లాడుతూ.. గత తొమ్మిది సంవత్సరాలుగా వార్డులో నెలకొన్న సమస్యలపై నిరంతరం పోరాడుతున్నానని గుర్తు చేశారు. ప్రజల పక్షాన పోరాటమే ఊపిరిగా.. గత ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తూ, వార్డు అభివృద్ధి కోసం ఎవరితోనైనా తలపడేందుకు తాను వెనుకాడలేదని ఆయన తెలిపారు. కేవలం ఎన్నికల సమయంలోనే వచ్చే నాయకుడిని కాదని, గత తొమ్మిదేళ్లుగా ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామినై ఉన్నానని పేర్కొన్నారు.

**అధికారంలోకి రాగానే అండగా నిలిచాం..**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే, వార్డు ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలను అందించడంలో ముందున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన వారికి మొదటి జాబితాలోనే ఇళ్లు మంజూరయ్యేలా కృషి చేశామని,వార్డులో కొత్త రేషన్ కార్డులు, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశామని తెలియజేశారు. డ్రైనేజీ, తాగునీరు వంటి స్థానిక సమస్యలపై తక్షణమే స్పందించి పరిష్కారం చూపామని అన్నారు.

# అండర్-19 ప్రపంచకప్‌లో భారత్ అజేయ దూకుడు

- జింబాబ్వేపై

### 204 పరుగుల భారీ విజయం

**బలగం టీవీ, బులవాయో**

పురుషుల అండర్--19 ప్రపంచకప్‌లో భారత జట్టు అజేయంగా దూసుకెళ్తోంది. లీగ్ దశలో హ్యాట్రిక్ విజయాలతో సూపర్ సిక్స్‌కు చేరిన టీమిండియా, జింబాబ్వేపై ఆల్‌రౌండ్ ప్రదర్శనతో 204 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది.

బులవాయోలోని స్పోర్ట్స్ క్లబ్ మైదానంలో జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 353 పరుగుల భారీ స్కోర్ నమోదు చేసింది. విహాన్ మల్హోత్రా (109) సూపర్ సెంచరీతో చెలరేగగా, అభిగ్యాన్ కుందు (61) అర్ధసెంచరీతో సహకరించాడు. ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ (52) వేగవంతమైన ఇన్నింగ్స్?తో జట్టు స్కోర్?కు బలమైన ఆరంభం ఇచ్చాడు.




353 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన జింబాబ్వే జట్టు భారత బౌలర్ల దాటికి తట్టుకోలేక 148 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్ ఆయుష్ మాత్రే (3/14), ఉద్ధవ్ మోహన్ (3/25) తలా మూడేసి వికెట్లు తీసి ప్రత్యర్థి బ్యాటింగ్‌ను కూల్చేశారు. జింబాబ్వే తరపున లిరోయ్ చివౌలా (62) అర్ధసెంచరీతో ఒంటరి పోరాటం చేశాడు.

**విహాన్ సూపర్ సెంచరీతో మెరుపులు**

భారత ఇన్నింగ్స్‌లో విహాన్ మల్హోత్రా అద్భుతంగా ఆడాడు. నాలుగు సిక్సర్లు, పలు ఫోర్లతో అలరించిన విహాన్, జట్టు ఇన్నింగ్స్?కు వెన్నెముకగా నిలిచాడు. అభిగ్యాన్ కుందుతో కలిసి ఐదో వికెట్‌కు శతక భాగస్వామ్యం నెలకొల్పి భారీ స్కోర్?కు బాటలు వేశాడు. చివర్లో అంబ్రిష్ (21), హెనిల్ పటేల్ (30)లతో కలిసి స్కోర్?ను 300 దాటించాడు. ఈ విజయంతో భారత్ సూపర్ సిక్స్ దశలోనూ తన ఆధిపత్యాన్ని చాటుతూ టైటిల్ ఫేవరెట్ గా నిలిచింది.

# అర్జిత్ సింగ్ షాకింగ్ నిర్ణయం

- ప్లేబ్యాక్ సింగర్‌గా వీడ్కోలు పలికిన అర్జిత్ సింగ్
- అభిమానులకు బిగ్ షాక్ ఇచ్చిన స్వర మాంత్రికుడు

**బలగం టీవీ, హైదరాబాద్**



బాలీవుడ్ గాయకుడు, స్వర మాంత్రికుడు అర్జిత్ సింగ్ అభిమానులకు ఊహించని షాక్ ఇచ్చారు. సంగీత ప్రపంచంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సాధించిన అర్జిత్ సింగ్ ఇకపై ప్లేబ్యాక్ సింగర్‌గా తన ప్రయాణాన్ని ముగిస్తున్నట్లు ప్రకటించారు. సినిమాల కోసం కొత్త పాటలు పాడబోనని వెల్లడిస్తూ తన అభిమానులను ఆశ్చర్యానికి గురిచేశారు. మంగళవారం ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అర్జిత్ సింగ్ ఈ కీలక ప్రకటన చేశారు. ప్లేబ్యాక్ సింగర్‌గా ఇకపై కొత్త ప్రాజెక్టులకు సంతకం చేయబోనని ఆయన స్పష్టం చేశారు. ఈ నిర్ణయంతో బాలీవుడ్ సంగీత రంగంలో పెద్ద చర్చ మొదలైంది.

ఈ సందర్భంగా అర్జిత్ సింగ్ తన పోస్ట్‌లో మాట్లాడుతూ, "ఇన్నేళ్లుగా శ్రోతలుగా మీరు నాకు ఇచ్చిన అపారమైన ప్రేమ, మద్దతుకు కృతజ్ఞతలు. ఈ రోజు నుంచి నేను ప్లేబ్యాక్ సింగర్‌గా కొత్త ప్రాజెక్టులు చేయను. అవును... ఈ ప్రయాణానికి ఇక్కడితో ముగింపు పలుకుతున్నాను. ఈ అనుభవం ఎంతో అద్భుతమైనది" అని పేర్కొన్నారు.ఇకపై స్వతంత్ర కళాకారుడిగా తన సంగీత ప్రయాణాన్ని కొనసాగించాలనుకుంటున్నానని, భవిష్యత్తులో మరిన్ని విషయాలు నేర్చుకుంటూ ఎదగాలన్నదే తన లక్ష్యమని అర్జిత్ తెలిపారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న కొన్ని ప్రాజెక్టులను మాత్రం పూర్తి చేస్తానని, ఈ ఏడాది తన కొన్ని పాటలు విడుదలవుతాయని చెప్పారు. "సంగీతాన్ని మాత్రం ఎప్పటికీ విడిచిపెట్టను" అని ఆయన స్పష్టం చేశారు. అయితే, అర్జిత్ సింగ్ అకస్మాత్తుగా ఈ నిర్ణయం తీసుకోవడానికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉందని సినీ వర్గాలు పేర్కొంటున్నాయి.

# 'కమిట్‌మెంట్' అనే పదానికి మరో అర్థం ఉంది





- చిరంజీవి వ్యాఖ్యలపై చిన్మయి స్పందన

**బలగం టీవీ, హైదరాబాద్**

మెగాస్టార్ చిరంజీవి చేసిన 'కమిట్‌మెంట్' వ్యాఖ్యలపై ప్రముఖ గాయని చిన్మయి శ్రీపాద సోషల్ మీడియా వేదికగా స్పందించడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. పరిశ్రమలో నిబద్ధతతో పనిచేస్తే అవకాశాలు వాటంతట అవే వస్తాయని చిరంజీవి వ్యాఖ్యానించగా, ఆ 'కమిట్‌మెంట్' అనే పదానికి వాస్తవ పరిస్థితుల్లో మరో అర్థం ఉందని, ముఖ్యంగా మహిళల విషయంలో అది లైంగిక వేధింపులకు పర్యాయపదంగా మారుతోందని చిన్మయి అభిప్రాయపడ్డారు.

ఇటీవల 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమా సక్సెస్ ఈవెంట్‌లో చిరంజీవి మాట్లాడుతూ, సినీ పరిశ్రమ అద్దంలాంటిదని, మనం ఎంత నిబద్ధతతో పనిచేస్తే అంతే ఫలితం వస్తుందని అన్నారు. అవకాశాల కోసం తప్పుడు మార్గాలు అనుసరించాల్సిన అవసరం లేదని యువతకు సూచించారు. ఈ వ్యాఖ్యలపై స్పందించిన చిన్మయి, చిరంజీవి తరం వేరని, అప్పటి పరిస్థితులు కూడా భిన్నంగా ఉండవచ్చని పేర్కొన్నారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో పరిశ్రమలో 'కమిట్‌మెంట్' ఇస్తేనే అవకాశాలు వస్తాయని కొందరు బహిరంగంగానే చెబుతున్నారని, ఆ పదం వెనుక లైంగిక ఆశలు దాగి ఉన్నాయని ఆమె తన పోస్టులో ఆవేదన వ్యక్తం చేశారు.

ఓ మహిళా సంగీత కళాకారిణి తాను ఎదుర్కొన్న వేధింపుల కారణంగా ఆ రంగాన్ని పూర్తిగా విడిచిపెట్టాల్సి వచ్చిందని, అలాగే గీత రచయిత వైరముత్తుతో తనకు ఎదురైన అనుభవాలను కూడా ఆమె గుర్తుచేశారు. ఇలాంటి ఘటనలు పరిశ్రమలో చాలామందికి తెలిసినా మౌనంగా ఉండడం బాధాకరమని చిన్మయి అన్నారు. బాధితులనే తప్పుపట్టే ధోరణి ఇంకా కొనసాగుతోందని, అవకాశాల పేరుతో మహిళలపై లైంగిక ఆశలు పెట్టుకునే పురుషులే అసలు సమస్య అని ఆమె స్పష్టం చేశారు. చిన్మయి చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారి, చిత్ర పరిశ్రమలో మహిళల భద్రత, గౌరవం అంశాలపై మరోసారి చర్చకు దారితీశాయి.




## విజయ్ దేవరకొండ కొత్త సినిమా'రణబాలి'

- టైటిల్ గ్లింప్స్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

గణతంత్ర దినోత్సవం సందర్భంగా నటుడు విజయ్ దేవరకొండ అభిమానులకు చిత్రబృందం అదిరిపోయే సర్ప్రైజ్ ఇచ్చింది. రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో విజయ్ దేవరకొండ నటిస్తున్న తాజా క్రేజీ ప్రాజెక్టుకు 'రణబాలి' అనే పవర్?ఫుల్ టైటిల్?ను ఖరారు చేస్తూ టైటిల్ గ్లింప్స్?ను విడుదల చేసింది. 1854 నుంచి 1878 మధ్యకాలంలో బ్రిటిష్ ఇండియా నేపథ్యంగా తెరకెక్కుతున్న ఈ చిత్రం ఒక పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోంది. అప్పట్లో బ్రిటిష్ పాలకులు సృష్టించిన కరువు పరిస్థితులు, వారి అకృత్యాలకు వ్యతిరేకంగా పోరాడిన ఓ వీరయోధుడి కథను ఈ చిత్రంలో చూపించనున్నట్లు మేకర్స్ తెలిపారు.

విడుదలైన గ్లింప్స్‌లో విజయ్ దేవరకొండ రఫ్ అండ్ పవర్?ఫుల్ వారియర్ లుక్?లో కనిపిస్తూ ఆకట్టుకున్నాడు. బ్రిటిష్ వారు అతడిని అనాగరికుడిగా చిత్రీకరించినప్పటికీ, భారత చరిత్రలో అతడు ఓ గొప్ప వీరుడని గ్లింప్స్ స్పష్టం చేసింది. 'టాక్సీవాలా' వంటి సూపర్ హిట్ తర్వాత విజయ్--రాహుల్ సాంకృత్యాన్ కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడం విశేషం. ఈ చిత్రంలో విజయ్ సరసన రష్మిక మందన్న 'జయమ్మ' అనే పాత్రలో నటిస్తోంది. ఇప్పటికే వీరిద్దరి కలయికలో వచ్చిన చిత్రాలు విజయవంతమవడంతో ఇది హ్యాట్రిక్ మూవీగా అంచనాలు పెంచుతోంది. మరో ఆసక్తికర అంశంగా, హాలీవుడ్ చిత్రం 'ది మమ్మీ' ఫేమ్ ఆర్నాల్డ్ వోస్లూ ఈ సినిమాలో కీలక పాత్రలో నటిస్తున్నాడు. మైత్రీ మూవీ మేకర్స్, టీ--సిరీస్ సంస్థలు సంయుక్తంగా అత్యంత భారీ బడ్జెట్?తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. అజయ్--అతుల్ సంగీతం అందిస్తున్న ఈ సినిమా ప్రేక్షకుల్లో భారీ ఆసక్తిని రేకెత్తిస్తోంది. 'రణబాలి' చిత్రాన్ని 2026 సెప్టెంబర్ 11న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది.

## చంద్రహాస్ 'బరాబర్ ప్రేమిస్తా' నుంచి రొమాంటిక్ మెలోడీ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**



ప్రముఖ టీవీ నటుడు ప్రభాకర్ కుమారుడు, 'రామ్‌నగర్ బన్నీ' ఫేం చంద్రహాస్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'బరాబర్ ప్రేమిస్తా'. సంపత్ రుద్ర దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో మిస్ ఇండియా ఫైనలిస్ట్ మేఘనా ముఖర్జీ హీరోయిన్?గా నటిస్తోంది. ఈ చిత్రానికి తాజాగా ప్రముఖ దర్శకుడు జయంత్ సి. పరాన్జీ మద్దతుగా నిలిచారు. 'బరాబర్ ప్రేమిస్తా' మూవీ నుంచి రొమాంటిక్ మెలోడీ 'మళ్లీ మళ్లీ' పాటను జయంత్ సి. పరాన్జీ విడుదల చేశారు. ఈ పాట ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని చిత్రబృందం ఆశాభావం వ్యక్తం చేసింది. తెలంగాణలోని రుద్రారం గ్రామాన్ని నేపథ్యంగా చేసుకుని ఈ చిత్రం రూపొందుతోంది. పరస్పరం గొడవలు పడే ఓ గ్రామంలో ప్రేమ, యాక్షన్, భావోద్వేగాలతో సాగే లవ్ స్టోరీని ఈ సినిమాలో చూపించనున్నట్లు ఇప్పటికే విడుదలైన టీజర్ ద్వారా మేకర్స్ సంకేతాలు ఇచ్చారు. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 6న థియేటర్లలో విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. సినిమాలో అర్జున్ మహి, మురళీధర్ గౌడ్, లక్ష్మణ్ మీసాల, మధునందన్, అభయ్ నవీన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.కాకర్ల సత్యనారాయణ సమర్పణలో సీసీ క్రియేషన్స్, ఏవీఆర్ మూవీ వండర్స్ బ్యానర్లపై గెడా చందు, గాయత్రి చిన్ని, ఏవీఆర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

# మోహన్ బాబుకు 'గవర్నర్ ఎక్సలెన్స్ అవార్డు'

### తెలుగు నటుడికి ఇదే తొలిసారి... సినీ పరిశ్రమకు గర్వకారణం

**బలగం టీవీ, హైదరాబాద్**



తెలుగు సినీ పరిశ్రమలో 'కలెక్షన్ కింగ్'గా విశేష గుర్తింపు పొందిన లెజెండరీ నటుడు మోహన్ బాబుకు అరుదైన గౌరవం లభించింది. 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా పశ్చిమ బెంగాల్ గవర్నర్ సీ.వి. ఆనంద్ బోస్ చేతుల మీదుగా ఆయన 'గవర్నర్ ఎక్సలెన్స్ అవార్డు'ను అందుకున్నారు. తెలుగు నటుడికి ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు దక్కడం ఇదే తొలిసారి కావడం విశేషం. కోల్?కతాలోని లోక్ భవన్?లో ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో మోహన్ బాబు ఈ అవార్డును స్వీకరించారు. అనంతరం నిర్వహించిన 'ఎట్ హోం' రిసెప్షన్?లో కూడా ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్?గా మారాయి. ఫొటోల్లో మోహన్ బాబు వెంట మంచు విష్ణు, నటుడు శివబాలాజీలు కూడా కనిపించారు.దాదాపు ఐదు దశాబ్దాలకు పైగా తెలుగు సినీ పరిశ్రమలో విలన్, హీరో, తండ్రి పాత్రలతో ప్రేక్షకులను మెప్పించిన మోహన్ బాబు అనేక సూపర్ హిట్ చిత్రాల్లో నటించారు. 'కలెక్షన్ కింగ్'గా పేరు తెచ్చుకున్న ఆయన, తన సొంత నిర్మాణ సంస్థ ద్వారా పలు విజయవంతమైన చిత్రాలను కూడా నిర్మించారు. సినీ రంగంతో పాటు సామాజిక సేవల్లోనూ ముందుండే మోహన్ బాబు, పేద విద్యార్థులకు ఉచిత విద్య, స్కాలర్?షిప్?లు అందిస్తూ అనేకమందికి అండగా నిలుస్తున్నారు. ఈ సేవలను గుర్తించిన ప్రభుత్వ వర్గాలు ఆయనకు ఈ అవార్డును ప్రదానం చేయడం తెలుగు సినీ పరిశ్రమకు గర్వకారణంగా నిలిచింది. ఈ అవార్డును సినీ ప్రముఖులు ఘనంగా స్వాగతించారు. "మోహన్ బాబుకు ఈ గౌరవం దక్కడం ఎంతో ఆనందంగా ఉంది" అంటూ పలువురు నటీనటులు సోషల్ మీడియా వేదికగా అభినందనలు తెలిపారు.

## వెంకటేశ్‌తో సినిమా ఆలస్యంపై తరుణ్ భాస్కర్ క్లారిటీ

**బలగం టీవీ, హైదరాబాద్**

ఫ్యామిలీ హీరో విక్టరీ వెంకటేశ్‌తో దర్శకుడు తరుణ్ భాస్కర్ తెరకెక్కించాల్సిన చిత్రం చాలాకాలంగా వాయిదా పడుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో ఆ ప్రాజెక్ట్‌పై తాజాగా తరుణ్ భాస్కర్ కీలక అప్డేట్ ఇచ్చారు. ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. తరుణ్ భాస్కర్ హీరోగా నటించిన తాజా చిత్రం 'ఓం శాంతి శాంతి శాంతిః' ఈ నెల 30న థియేటర్లలో విడుదల కానుంది. సినిమా ప్రమోషన్లలో భాగంగా సోమవారం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు నటుడు విశ్వక్ సేన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలోనే తరుణ్ భాస్కర్ తన కెరీర్‌లో ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న వెంకటేశ్ ప్రాజెక్ట్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 2019లో గుర్రపు పందెం జూదగాడి నేపథ్యంతో విక్టరీ వెంకటేశ్‌తో 'డెక్కన్ డెర్బీ' అనే చిత్రాన్ని ప్లాన్ చేసినట్లు తరుణ్ భాస్కర్ గుర్తు చేశారు. ఈ సినిమాను నిర్మించేందుకు నిర్మాత సురేష్ బాబు కూడా అంగీకరించినప్పటికీ, కొన్ని కారణాల వల్ల ఈ ప్రాజెక్ట్ ముందుకు సాగలేదని తెలిపారు.ఈ విషయంపై స్పందించిన తరుణ్ భాస్కర్, "ఆ ప్రాజెక్ట్?ను తాత్కాలికంగా నిలిపివేయడం నా నిర్ణయమే. ముఖ్యంగా స్క్రీన్?ప్లేలో, రెండో భాగంలో ఇంకా మెరుగులు దిద్దాల్సి ఉంది. అలాగే సినిమా టెక్నికల్ స్టాండర్డ్స్ కూడా ఒక కారణం. ప్రస్తుతం స్క్రిప్ట్‌పై మళ్లీ సీరియస్?గా పని చేస్తున్నాను" అని స్పష్టం చేశారు. షూటింగ్ ఎప్పుడు ప్రారంభమవుతుందన్న ప్రశ్నకు ఆయన స్పందిస్తూ, "ఈ ఏడాదైనా కావచ్చు, లేదా తర్వాతైనా కావచ్చు. ఈ ప్రాజెక్ట్ పూర్తిగా నాపైనే ఆధారపడి ఉంది. ఇంకా చాలా పని చేయాల్సి ఉంది" అని అన్నారు.